సాక్షి నంద్యాల
శుక్రవారం, 10, అక్టోబర్, 2025



పాఠశాలకు వెళ్తుండగా ఘోరం
తండ్రి తన కుమారుడిని పాఠశాలకు స్కూటర్‌పై తీసుకెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో తండ్రి, కుమారుడు మృతి చెందారు. పోతుగల్లులో విషాద ఛాయలు అలుముకున్నాయి. IIలో▸



మట్కా జోరు!
గ్రామీణ ప్రాంతాల్లో 'మట్కా' షికారు చేస్తోంది. కూటమి పాలన వచ్చిన తర్వాత మట్కారాయుళ్లకు అడ్డు లేకుండా పోయింది. వీరికి టీడీపీ నాయకుల అండ ఉన్నట్లు తెలుస్తోంది. IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.95
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.632
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,970
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,419

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశం

బొమ్మలసత్రం: జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నంద్యాల ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయ కర్తలు, పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

జేసీగా కొల్లబత్తుల కార్తీక్

నంద్యాల: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కొల్లబత్తుల కార్తీక్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్‌మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాలలో పని చేస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ సెక్రటరీగా బదిలీ చేశారు. విష్ణుచరణ్ 14 నెలల పాటు జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

డోన్ ఐటీఐలో 13న అప్రెంటిషిప్ మేళా

నంద్యాల(న్యూటౌన్): డోన్ పట్టణంలో ఉన్న ఐటీఐలో ఈనెల 13వ తేదీన ఉదయం 9గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులందరూ ఈ మేళాకు హాజరు కావాలని తెలిపారు. ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళాకు వివిధ ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒరిజినల్ ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, కులధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఫొటోలు జిరాక్స్ కాపీలతో రావాలని తెలిపారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయం




తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): ఎమ్మార్పీ కంటే యూరియా, డీఏపీ తదితర ఎరువులను అధిక ధరలకు అమ్ముతున్నారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో వెల్లడైంది. దీంతో రూ.3,48లక్షల విలువ చేసే 147 బస్తాల యూరియా, 229 బస్తాల డీఏపీల ఎరువులను సీజ్ చేశారు. ఎమ్మార్పీ కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో గురువారం నంద్యాల పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ వ్యవసాయాధికారి విశ్వనాథ్, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావుల ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని వెంకట సునిల్ ట్రేడర్స్, సేగు శ్రీనివాసులు అండ్ బ్రదర్స్, హర్షిత ఎంటర్‌ప్రైజెస్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అధిక ధరలకు అమ్ముతున్న ఎరువులను సీజ్ చేసి, ప్రతి డీలర్ ఎఫ్‌సీఓ 1985 ప్రకారం వ్యాపారం చేయాలని, చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి 'ఎన్‌టీఆర్' వైద్య సేవలు నిలిపివేత

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీ నుంచి ప్రైవేటు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) ద్వారా అందించే వైద్యసేవలు నిలిపివేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డికి ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశా) నాయకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాహుల్, డాక్టర్ సునిల్ సేపూరి నోటీసులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రులకు రూ.3 వేల కోట్లకు పైగా ఎన్‌టీఆర్ వైద్యసేవ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదని, అందుకే వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. దీంతో శుక్రవారం నుంచి కర్నూలు జిల్లాలో 60 ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలు నిలిచిపోనున్నాయి. అయితే ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.



డాక్టర్ భాస్కర్‌రెడ్డికి నోటీసులు అందజేస్తున్న ఆశా సంఘం నాయకులు

'కూటమి' పాలనలో దళితులపై వివక్ష



సమావేశానికి హాజరైన దళితులు

- అట్టడుగు వర్గాలను అణచి వేస్తున్నారు
- ఒక్క హామీని కూడా అమలు చేయలేదు
- హక్కులను అడిగితే బెదిరిస్తున్నారు
- తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు
- దళితులను భయపెట్టడమే చంద్రబాబు సిద్ధాంతం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బొమ్మలసత్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై వివక్ష పెరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. అట్టడుగు వర్గాలను సీఎం చంద్రబాబు అణచి వేస్తున్నారని విమర్శించారు. దళితులను భయపెట్టి అణగదొక్కటమే లక్ష్యంగా పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. నంద్యాల పట్టణంలోని తేజస్విని హోటల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరావు, పార్లమెంట్ పరిశీలకురాలు కల్పలతారెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్ కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

భయపెడుతూ తప్పుడు కేసులు

తన ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి రాక్షస పాలనను ఎప్పుడూ చూడలేదని కాటసాని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఓర్వకల్లు మండలంలో రమేష్ అనే దళిత కార్యకర్తపై ఐదు తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం దక్కించుకుని ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేయలేదన్నారు. టీడీపీ నేతలకు కొందరు అధికారులు తొత్తులుగా మారుతున్నారని, రానున్న రోజుల్లో అటువంటి వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలన

రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలన సాగుతోందని కాటసాని విమర్శించారు. దళితులను దివంగత నేత వైఎస్సార్ ఆదుకున్నారని, మహానేత తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహరెడ్డి మాత్రమే దళితులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి స్థానంలో నిలిచారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీని అమలు చేస్తే కూటమి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. దళితులు బాగుపడాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

దళితుల ద్రోహి చంద్రబాబు



దళితుల ద్రోహి ముమ్మాటికీ చంద్రబాబే అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు దళితులకు రూ.70 వేల కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ గెలిచి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. సీఎం చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని, ఇకపై ఇలాంటి మోసాలు ప్రజలు నమ్మబోరన్నారు. రాష్ట్రంలో లక్ష మందితో జగనన్న దళిత ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో గ్రామ స్థాయి నుంచి దళితులు సభ్యులుగా ఉంటారన్నారు.

కనిపించని సంక్షేమం'



రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కనిపించడం లేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. పేద పిల్లలకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మాణానికి కృషి చేశారన్నారు. దళిత కుటుంబాల్లో కూడా సులభంగా వైద్యవిద్యను అభ్యసించే అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. ఈ కాలేజీలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ విధానమంటూ ఆర్వో ప్లాంట్‌ను కూడా రిపేరీ చేయించకుండా ప్రజల ప్రాణాలు తీస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీకి దళితులు గట్టి పునాదులన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విజివల్ ఆర్ట్స్ డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఉమ్మడి జిల్లాల ఎస్సీ సెల్ సమన్వయకర్త యోబు, ఎస్సీ సెల్ నంద్యాల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నియోజకవర్గాల అధ్యక్షులు పుల్లయ్య, సత్యం, జయపాల్, వెంకటేశ్వర్లు, హేమలత, మండలాధ్యక్షులు ఆర్థర్ సైమన్, శెట్టిప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్‌షావలి, ఎస్సీ సెల్ నేతలు మద్దయ్య, పార్టీ అధికార ప్రతినిధి అనిల అమృత రాజ్, చాణక్యరాజ్, కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలి





మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, హాజరైన పారాలీగల్ వలంటీర్లు

కర్నూలు(సెంట్రల్): న్యాయ సేవలపై పారా లీగల్ వలంటీర్లు అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ధి సూచించారు. గురువారం న్యాయ సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంటక హరినాథ్ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిషేధం, కార్మిక సంక్షేమ చట్టం, వినియోగదారుల రక్షణ చట్టం, రెవెన్యూ చట్టాలను వివరించారు. లోక్ అదాలత్‌లో తగదాలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని, ఈ తీర్పులపై అప్పీలుకు వీలుండదని, చెల్లించిన కోర్టు ఫీజును కూడా తిరిగి ఇవ్వనున్నట్లు వివరించారు. న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వలంటీర్లకు సూచించారు.

సమన్వయంతో పీఎం పర్యటనను విజయవంతం చేద్దాం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. గురువారం ఆమె ప్రధానమంత్రి పర్యటించే నన్నూరు సమీపంలోని రాగమయూరి వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా అధికారులతో సమీక్షించారు. అంతకుముందు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి పీఎం సభా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పార్కింగ్ ప్రదేశాల్లో 11వ తేదీలోపు అంతర్గత రహదారులను నిర్మించాలని ఇన్‌చార్జీలుగా ఉన్న ఇరిగేషన్, పీఆర్ ఎస్‌ఈలు, హౌసింగ్ పీడీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈలను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతం, నన్నూరు టోల్‌గేట్‌లో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బస్సుల్లోనే వచ్చిన వారికి భోజనం, నీటిని అందించాలని డీఎస్‌ఓ రాజారఘువీర్‌కు సూచించారు. స్టేజీకి కుడి పక్కన సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని డీఈఓ శ్యామూల్ పాల్‌కు తెలిపారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్ నాయక్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

- బేతంచెర్లకు 'గోరుకల్లు' నీరు తీసుకొచ్చాం
- ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ప్రారంభించాం
- నేటి ప్రభుత్వంలో ప్రజల' కష్టాలు
- నేడు అంతా ప్రైవేటీకరణే!
- 'స్థానిక' ఎన్నికలు వస్తే వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: రాష్ట్రంలో అభివృద్ధి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, అప్పుడు నిర్మించిన భవనాలకు రంగులు వేసుకోలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బేతంచెర్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి , పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బుగ్గన మాట్లాడుతూ... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డోన్‌ను రాష్ట్రానికే మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసిందన్నారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా రూ. 351 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్లకు మంచినీరు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి రోజూ నీటిని సరఫరా చేయలేక వారానికి ఒక్కసారి వదిలే దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. వంకమిట్టపల్లె, కొలుపల్లె, ఇందిరాంపల్లెకు నీరు ఇవ్వాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పనులు పూర్తి చేయలేకపోయిందన్నారు.

అంతా 'ప్రైవేట్' కలెక్షన్లు

గత ప్రభుత్వంలో పూర్తయిన ఐటీఐ, ఎంఎస్ఎంఈ భవనాలు నేటి వరకు తెరుచుకోకవడం దారుణం అని మాజీ మంత్రి బుగ్గన అన్నారు. తాము శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించడంతో వందలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారన్నారు. శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం ముఖద్వారానికి రూ. 2 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయి రెండు సంవత్సరాలు అవుతున్నా నేటి వరకు ఒక్క రాయి వేయలేదన్నారు. ఆలయంలో రూ. 50 కోట్లతో ప్రారంభమైన అభివృద్ధి పనులు ఎంత వరకు పూర్తయ్యాయని ప్రశ్నించారు. నాపరాళ్ల రాయల్టీలను ప్రైవేటుకు అప్పగించారని, ఒక్కో ఫ్యాక్టరీ నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇలా ప్రైవేట్ కలెక్షన్లు జరిగాయా? అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ఫ్యాక్టరీల దగ్గర మీటర్లను చూసి సేల్స్ ట్యాక్స్ కూడా వసూలు చేసే అవకాశం ఉందన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ కచ్చితంగా గెలుపొందుతుందని మాజీ మంత్రి బుగ్గన అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డోన్ నియోజకవర్గంలో జాతీయ రహదారి, గ్రామాలకు రహదారులు అభివృద్ధి చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను, బీసీ గురుకుల పాఠశాలలను తీర్చిదిద్దిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అండగా ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడటంతోనే 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తీసుకవచ్చారని, ఈ విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీ కృష్ణ, గిడ్డంగుల శాఖ, ఉర్దూ అకాడమీ మాజీ డైరక్టర్లు మూర్తుజావలి, బాబుల్ రెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మురళీధర్ రెడ్డి, గూని నాగరాజు, సలీమ్, ఖాజా, మల్లిరెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, ముస్తఫా, కిరణ్, నిరంజన్, వలిబాషా, ఆకుల రమణ, గోరుమానుకొండ, గూటుపల్లె సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు పాల్గొన్నారు.

కదలని ఫైళ్లు.. పర్యాటకం లేని గోరుకల్లు

- వైఎస్సార్‌సీపీ హయాంలో భూమిని గుర్తించిన అధికారులు
- 86.43ఎకరాలు అందుబాటులో ఉందని ఇరిగేషన్ అధికారుల లేఖ
- అయినా పర్యాటక అభివృద్ధిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



గోరుకల్లు జలాశయం

పాణ్యం: రాయలసీమ జీవనాడిగా పేరుపొందిన గోరుకల్లు జలాశయాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అడుగులు పడ్డాయి. స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ఉపాధి దొరుకుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళిక సైతం రూపొందించారు. అయితే కూటమి ప్రభుత్వం గత ఫైళ్లను పట్టించుకోవడం లేదు. దీంతో గోరుకల్లు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. జీవనోపాధికోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

భూమి కేటాయింపు ఇలా..

గోరుకల్లు జలాశయం వద్ద 86.43ఎకరాల భూమి అందుబాటులో ఉందని అప్పటి జిల్లా కలెక్టర్‌కు 2022లో ఎస్సార్బీసీ అధికారులు తెలియజేశారు. అందుకు సంబంధించిన వివరాలను లేఖలో పొందుపర్చారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీసుకెళ్లారు. విజయవాడలోని పర్యాటక శాఖ నుంచి ఉన్నతాధికారులు ఏజేన్సీకు పంపించి నివేదిక తీసుకున్నారు. పర్యాటక అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు, యువకులు ఎంతో సంతోషించారు. అప్పట్లోనే గోరుకల్లుతో పాటు పాణ్యం మండలం సుగాలిమెట్ట వద్ద ఐదు ఎకరాల్లో పర్యాటక అభివృద్ధి చేసేందుకు భూమిని కేటాయించారు. అయితే గత ప్రభుత్వంలో మొదలైన ప్రక్రియ ఎన్నికల కారణంగా 2024లో వాయిదా పడింది.

కూటమి ప్రభుత్వంలో ఇలా..

రాయలసీమ జిల్లాలకు తాగు, సాగు నీరు అందించే గోరుకల్లు జలాశయం చుట్టూ అందమైన కొండలు, వివిధ పంటలతో కళకళలాడే పొలాలు ఉన్నాయి. గోరుకల్లును పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దితే ఇక్కడికి వచ్చేవారు స్వల్పదూరంలో ఉన్న శ్రీ దుర్గాభోగేశ్వర స్వామి, శ్రీవల్లి సుబ్రమణ్యం స్వామి, శ్రీచౌడేశ్వరి అమ్మవారి ఆలయాలను చూడవచ్చు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన పర్యాటక ప్రదేశాలకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి సమీక్షలు చేపట్టలేదు. గోరుకల్లు జలాశయాన్ని పర్యాటక ప్రదేశంగా గుర్తించి అభివృద్ధి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రజలు విన్నవించినా ఫలితం లేదు. ఫైళ్లు ఇప్పటి వరకు కదల్లేదు. పర్యాటకం ఊసునే మరచిపోయారు. దీంతో గోరుకల్లు గ్రామస్తులు జీవనోపాధి కోసం ఇతర గ్రామాలకు వలస వెళ్తున్నారు. కనీసం పర్యాటక అభివృద్ధి చేపడితే కొంత మందికైనా ఉపాధి దొరుకుందని ఎదురుచూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

గోరుకల్లు జలాశయం వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం. అయితే ఇంత వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. –నాగార్జున, పర్యాటకశాఖ ఏఈ

అద్దె చెల్లించకుంటే ఖాళీ చేయాల్సిందే!

- ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని దుకాణాదారులకు నోటీసులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని దుకాణదారులు పెండింగ్ అద్దెలు చెల్లించకపోతే ఖాళీ చేయిస్తామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఏడు షాపింగ్ కాంప్లెక్సుల్లో 59 దుకాణాలు, నంద్యాల జిల్లాలోని ఆరు షాపింగ్ కాంప్లెక్సుల్లో 46 దుకాణాలను నిర్వహిస్తూ పేద దళితులు జీవనోపాధి పొందుతున్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు అద్దెలు జమ చేయడంలో గత ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అద్దెలను నిక్కచ్చిగా వసూలు చేయాలని ఈ ఏడాది ఆగస్టు 18న జీఓ 26 జారీ చేసింది. ముచ్చటగా మూడవసారి నోటీసులను అందించారు. కాగా.. ఉమ్మడి జిల్లాలో అద్దె బకాయిలు రూ.1.01 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు రూ.43 లక్షలను చెల్లించారు. మరో రూ.57 లక్షల బకాయి ఉంది. ప్రభుత్వ చర్యల పట్ల ఎస్సీ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

మట్కా జోరు!



- కర్ణాటక తీర నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా జూదం
- మంత్రాలయంలో చాపకింద నీరులా మట్కా
- పచ్చని పల్లెల్లో మట్కా మరకలు
- రోజుకు రూ.లక్షల్లో బీట్

మంత్రాలయం: పచ్చని పల్లెల్లో మట్కా మానియా షికారు చేస్తోంది. కూటమి పాలన వచ్చిన తర్వాత మట్కా రాయుళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. నాయకుల అండకు పోలీసుల నిర్లక్ష్యం తోడు కావడంతో పచ్చని పల్లెల్లో మట్కా మరక మచ్చగా మారుతోంది. చాపకింద నీరులా పాకి పల్లెల మకుటంగా పరిణమిల్లుతోంది. వ్యసనపరుల పాలిట పల్లకీగా ఊరేగుతోంది. ముఖ్యంగా కర్ణాటక, తుంగభద్ర నదీ తీర నియోజకవర్గాల్లో మట్కా పెచ్చుమీరి పోయింది. కొన్ని నియోజకవర్గాల్లో నాయకుల అండదండలతోనే సాగుతున్నట్లు పుకార్లు గుప్పుమంటున్నాయి. ఎంతో మంది నంబర్ల ఆటలో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు ఆస్తులు సైతం ఆటకు అర్పణం చేసుకున్న సంఘటనలు లేకపోలేదు. ఇంతగా మట్కా కరాళనృత్యం చేస్తున్నా పోలీసులకు పట్టడం లేదు. ఉదయం 10 గంటలతోనే మట్కా షోలు మొదలవుతున్నాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు నంబర్ ఓపెన్‌లు, క్లోజ్‌లు సాగుతున్నాయి. కల్యాణి.. శ్రీదేవి.. ముంబాయి.. మిలాన్.. ఇలా ఎన్నో మట్కా కంపెనీలు ఇక్కడ చెలామణిలో ఉన్నాయి. ఓపెన్.. క్లోజ్.. బ్రాకెట్.. పాన్ నంబర్లకు ఒక్కోదానికో రేటు ఉంటుంది. ఎక్కడో ముంబాయిలో పుట్టుకొచ్చిన ఈ కంపెనీలు నేడు పల్లెలకు పాకి కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. ఎంతో మంది మట్కా మోజులో ఆర్థికంగా చితికిపోతున్నారు.

24.05.2025న
కోసిగి మండల కేంద్రానికి చెందిన ముగ్గురు బీటర్లు మట్కా ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.3,100 నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోసిగి మండల కేంద్రానికి చెందిన కురువ లింగారెడ్డి, పులుసు వీరేష్, హనుమంతుపై కేసు నమోదు చేయడం జరిగింది.

25.07.2025న
కోసిగి మండలం కోల్మాన్‌పేటలో మరో ముగ్గురు మట్కా బీట్ రాస్తూ పోలీసులకు దొరికిపోయారు. వారి నుంచి రూ. 4,120, సెల్‌ఫోన్లు స్వాధీన పరుచుకున్నారు. కోల్మాన్‌పేటకు చెందిన గిరిస్వామి, కృష్ణ, అంజనేయులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

20.09.2025న
మంత్రాలయం మండలం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో మట్కా నిర్వాహకులపై దాడులు చేశారు. గ్రామానికి చెందిన మట్కా బీటర్లు పింజరి నవాబ్, బోయ మజ్జినఈరన్న, బోయ నర్సిరెడ్డి జమ్మి మరుసు దగ్గర మట్కా రాస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.38,450 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికీ ఆ గ్రామం మట్కాకు కేంద్రమన్నది బహిరంగ రహస్యం.

రోజుకు రూ.18 లక్షల వరకు బీట్

ఐదు నియోజకవర్గాల నుంచి రోజుకు రూ.18 లక్షల మేరా బీట్ వెళ్తున్నట్లు అంచనా. అత్యధికంగా ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు ప్రాంతాల నుంచి వెళ్తుండగా ఇటీవల మంత్రాలయం, పత్తికొండ ప్రాంతాల్లో బీట్ మొదలైంది. ఆలూరు, పత్తికొండ కేంద్రాల నుంచి బళ్లారికి ఎక్కువగా పోతున్నట్లు వినికిడి. ఎమ్మిగనూరు నుంచి ఆదోని, మంత్రాలయం నుంచి మాన్వికి బీట్ పంపుతున్నట్లు సమాచారం. మంత్రాలయం మండలంలోని మాధవరం స్టేషన్ పరిధిలో ఓ గ్రామం నుంచి రోజుకు రూ.2-3 లక్షల వరకు బీట్ వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మట్కా మానియా

జిల్లా పశ్చిమాన మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఈ మధ్య కాలంలో మట్కా పాకిపోయింది. విచ్చలవిడిగా మట్కా మత్తు ఆవహిస్తోంది. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు నియోజకవర్గ కేంద్రాలతోపాటు ఆయా నియోజకవర్గాల్లోని ప్రధాన పల్లెల్లో మట్కా బీటర్లు ఉన్నారన్న విషయం బహిరంగ రహస్యం. మంత్రాలయం నియోజకవర్గంలోని గోతులదొడ్డి, హాల్వి, నదిచాగి, కాత్రికి, కుంటనహాల్, మాధవరం, కౌతాళం, కోసిగి, వందగల్లు, రచ్చుమర్రి, చిన్నతుంబళం, జాలవాడి, కంబదహాల్, దొడ్డిబెళగల్, తుంగభద్ర, చింతకుంట, పెద్దకడబూరు, మాలపల్లి, సుంకేశ్వరి గ్రామాల నుంచి మట్కా బీట్ వెళ్తున్నట్లు సమాచారం. సదరు గ్రామాల్లో బీటర్లు తమ బీట్‌ను ఆదోని, కర్ణాటకలోకి మాన్వి, రాయచూరు, దుదిని ప్రాంతాలకు పంపుతున్నట్లు తెలుస్తోంది. మట్కా జోరుగా సాగుతున్నాయనడానికి నమోదువుతున్న కేసులే ఉదాహరణ. కూటమి ప్రభుత్వ హయాంలో కోసిగి పోలీస్ స్టేషన్‌లో 18 కేసులు, మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. పెద్దకడబూరు స్టేషన్ పరిధిలో చిన్నతుంబళంలో రెండు, కంబదహాల్‌లో ఓ కేసు నమోదయ్యాయి.

ఆన్‌లైన్‌లో ఆటలు

గతంలో బీట్ వంపాలంటే బీటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసేవాళ్లు. ఇప్పుడంతా ప్రయాస అక్కర్లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే ఆటలు సాగిపోతున్నాయి. ఫోన్ మెసేజ్, వాట్సాప్‌ల ద్వారా లావాదేవీలు కానిస్తున్నారు. కంపెనీ పేరు, సమయం పొందుపరుస్తూ నంబర్లను పంపుతున్నారు. బీటర్లు అక్కడి నుంచి కంపెనీ ఏజెంట్లకు చేరవేస్తున్నారు. కొందరు ఏజెంట్లు కంపెనీలుగా మారినట్లు వ్యక్తమవుతోంది. అదృష్టం కొద్దీ లాటరీ తగిలితే రూ.లక్షకు మించి నగదు బదిలీ జరగాలంటే నేరుగా ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. అంతలోపు లావాదేవీలు ఫోన్‌పే, గూగుల్, వాట్సాప్ పేతో కానిస్తున్నారు.

మామూళ్లతో అండదండలు

నాయకుల అండదండలు పొందేందుకు బీటర్లు, ఏజెంట్లు అధికార పార్టీ నేతలకు మామూళ్లు సర్దుతున్నారు. నాయకుల అండదండలతో తమ కార్యాకలాపాలకు అడ్డూఅదుపు లేకుండా చూసుకుంటున్నారు. ఇదే తరహాలో కొన్ని స్టేషన్లకు మట్కా రుచి చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా కొన్ని పోలీస్ స్టేషన్లకు మట్కా బీటర్ల ద్వారా అమ్యామ్యాలు ఉన్నట్లు సమాచారం. ఓ నియోజకవర్గంలో ఓ చిన్న నేత బీటర్లకు వత్తాసు ఉన్నట్లు వినికిడి. మట్కా బీటర్లను అప్పుడప్పుడూ ఆయన సేఫ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మట్కా జోరు నిఘా పోలీసు విభాగాలకు తెలిసినా ఫలితం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదీ ఏమైనా మట్కా మాఫియాను అణచి వేయడంలో పోలీసులు కాస్త వెనకబడి పోయారనడంలో సందేహం లేదు.

మట్కాపై ప్రత్యేక నిఘా



మట్కాపై ప్రత్యేక నిఘా ఉంచాం. కానిస్టేబుళ్లు, గ్రామస్తుల సహకారంతో మండలంలో ఇప్పటివరకు 19 కేసులు నమోదు చేశాం. ఏ చిన్న సమాచారం వచ్చినా మట్కా బీటర్ల భరతం పడుతున్నాం. సమాజానికి చేటుగా మారిన మట్కాను అరికట్టేందుకు శాయాశక్తులా కృషి చేస్తున్నాం. ప్రజలు సైతం మట్కాకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం.
– హనుమంతురెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్, కోసిగి

క్లుప్తంగా

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ



డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 7వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చేసిన తీర్మానం మేరకు.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లలో బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం డీఆర్‌ఓ నారాయణమ్మ, డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం హాజరు చేపడతామని, గూగుల్ షీట్ సమాచారం పంపడం, ఆన్‌లైన్ సమావేశాలు వంటి వాటిని బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఫ్యాప్టో అనుబంధ సంఘాల నాయకులు నవీన్ పాటిల్, గోకారి, జనార్దన్, మరియానందం, మధుసూదన్ రెడ్డి, హుసేన్, నందీశ్వరుడు, రోశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖతార్- దోహాలో హోంకేర్ నర్సు ఉద్యోగాలు

కర్నూలు(అర్బన్): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓఎంసీఏపీ ద్వారా బీఎస్సీ నర్సింగ్/ జీఎన్ఎం నర్సింగ్ చదివి 21 -40 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులకు కథార్ – దోహాలో హోంకేర్ నర్సుగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ ఎస్ సబీహా పర్వీన్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/userregistration? page=programme-registration వెబ్‌లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులకు సర్టిఫికెట్లను జతచేసి ఈ నెల 12లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందించాలన్నారు. మరి న్ని వివరాలకు సెల్ 94408 22219, 98488 64449 నంబర్లను సంప్రదించాలన్నారు. 13వ తేదీన ఇంటర్వ్యూలు ఓఎంసీఏపీ ఆఫీసు, ప్రభు త్వ ఐటీఐ క్యాంపస్, రమేష్ హాస్పిటల్ రోడ్, విజయవాడలో ఉంటాయని వెల్లడించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు: జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి గ్రామానికి చెందిన షేక్ మాబు బాషా (41) రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. సమీప బంధువు వహీద్ బాషాతో కలిసి బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వస్తుండగా ఎదురూరు గ్రామ శివారులోని సూరత్ హైవే బ్రిడ్జి వద్ద టిప్పర్ ఢీకొట్టడంతో షేక్ మాబు బాషా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయన కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య షేకున్‌తో పాటు ముగ్గురు కూతుర్లు సంతానం. వాహనం నడుపుతున్న వహీద్ బాషా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వహీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా సురేష్

కర్నూలు(అర్బన్): జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా డి.సురేష్ నియమితులయ్యారు. గురువారం జరిగిన డీపీసీలో అనంతపురం డీటీడబ్ల్యూఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్‌కు డీటీడబ్ల్యూఓగా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలోనే ఆయనను కర్నూలు డీటీడబ్ల్యూఓగా పోస్టింగ్ ఇస్తూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి ఉత్తర్వులు జారీ చేశారు.

డీసీసీబీలో సహకార ఉత్సవ్ డిపాజిట్ పథకం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు దీపావళి, సహకార వారోత్సవాలను పురస్కరించుకొని సహకార ఉత్సవ్ డిపాజిట్ పథకానికి శ్రీకారం చుట్టింది. గురువారం డీసీసీబీలో నిర్వహించిన కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఈ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో 666 రోజుల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్‌లకు 8.10 శాతం(నికరంగా 8.64 శాతం), ఇతరులకు 7.60 శాతం(నికరంగా 8.07 శాతం) వడ్డీ లభిస్తుందన్నారు. పథకం నవంబర్ 21 వరకు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు, డీసీవో వెంకటకృష్ణ, డీజీఎం సునీల్‌కుమార్, ఏజీఎంలు త్రినాథ్‌రెడ్డి, గీత తదితరులు పాల్గొన్నారు.

చిరుత గోరు, కణితి కొమ్ము స్వాధీనం

శ్రీశైలంప్రాజెక్ట్: పాత సున్నిపెంట ప్రాంతంలో వై.చెన్నారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో గురువారం చిరుతపులి గోరు, కణితి కొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ బబితా కుమారి వెల్లడించారు. ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావుకు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం రాత్రి బబితాకుమారి, ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రణతిబాయి, శ్రీశైలం రేంజ్ అధికారి ఎం.పరమేశ్ తనిఖీలు చేపట్టారు. నిందితుడి ఇంట్లో చిరుత గోరు, కణితి కొమ్ము లభ్యమయ్యాయని, చెన్నారెడ్డి అందుబాటులో లేని కారణంగా నోటీసులు ఇచ్చామని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌డీఎఫ్ఓ చెప్పారు. పాత తరం వ్యక్తులు వన్యప్రాణుల చర్మాలు, గోర్లు, కొమ్ములు, దంతాలను మూఢ నమ్మకాలతో ఇళ్లల్లో ఉంచుకుంటారని, ఇలాంటి చర్యలు నేరమన్నారు. అలాంటివి కలిగిఉన్న వారు స్వచ్ఛందంగా అటవీ అధికారులకు అందిస్తే సంజాయిషీతో వదిలేస్తామని, లేకపోతే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న గోరు, కొమ్ము, వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీఎఫ్ఓ బబితా కుమారి

కౌన్సెలింగ్ తికమక!



అభ్యర్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీఈఓలు శామ్యూల్ పాల్, జనార్దన్ రెడ్డి

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ మొదలైంది. ఎస్‌జీటీ పోస్టులు ఎక్కువగా ఉండటంతో మాన్యువల్‌గా, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఎస్‌జీటీలకు గురువారం రాత్రి శిక్షణ కేంద్రాల్లోనే కౌన్సెలింగ్ ప్రారంభించారు. కౌన్సెలింగ్‌పై ముందుగానే అవగాహన కల్పించినా విద్యా శాఖ చూపించిన ఖాళీల్లో ఏ స్కూల్ ఎంత దూరంలో ఉందో అభ్యర్థులకు తెలియకపోవడం అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా 3, 4 కేటగిరీల్లోని పోస్టులలో నూతన టీచర్లను నియమిస్తున్నారు. శుక్రవారం నాటికి ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌ల కౌన్సెలింగ్ పూర్తి చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రక్రియ కొనసాగుతోంది. కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లందరికీ 11వ తేదీన ఎంపిక చేసుకున్న స్కూళ్ల పేరుతో ఆర్డర్లు జారీ కానున్నాయి. ఈనెల 13న వారికి కేటాయించిన స్కూళ్లలో చేరాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎస్‌జీటీలుగా ఎంపికైన వారిలో అత్యధిక శాతం మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగాలు సాధించిన వారున్నారు. దీంతో స్కూళ్లను ఎంపిక చేసుకునే అంశంపై సరైన అవగాహన లేక, కనీసం తెలిసిన వారిని అడిగి ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వకపోవడంతో తికమక పడుతున్నారు. జోనల్ స్థాయిలో టీజీటీ, పీజీటీలకు, ప్రిన్సిపల్ పోస్టులకు ఎంపికైన టీచర్లు శిక్షణ పొందే చోటనే వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

అర్చకుల వల్లే ఆలయ ప్రతిష్టకు భంగం

- దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ తీవ్ర అసంతృప్తి
- తగ్గిన కొలనుభారతి అమ్మవారి హుండీ ఆదాయం



ఆలయ అర్చకులకు సూచనలు చేస్తున్న దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి

కొత్తపల్లి: రాష్ట్రంలో ఏకైక సరస్వతీ దేవి క్షేత్రం కొలనుభారతి. అలాంటి ఆలయ ప్రతిష్టను, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల మనోభావాలను అర్చకులే దెబ్బతీస్తున్నారని నంద్యాల జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కొలనుభారతి క్షేత్రంలో ఈఓ రామలింగారెడ్డి, చైర్మన్ వెంకటనాయుడు, సర్పంచు చంద్రశేఖర్‌తో కలిసి హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. ఈ ఏడాది మే 26వ తేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా కేవలం రూ.1,44,115 మాత్రమే రావడంతో ఆశ్చర్యపోయారు.

తీరు మార్చుకోకుంటే సస్పెండ్ చేస్తాం

ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి మాట్లాడుతూ.. అర్చకుల మధ్య గొడవలు, ప్రవర్తన ద్వారా ఆలయ ప్రతిష్ట మసకబారుతుందన్నారు. అక్షరాభ్యాసాలు, అర్చనలు, సంభావనల పేరుతో భక్తుల నుంచి ఎక్కువ డబ్బు డిమాండ్ చేస్తూ వారి మనోభావాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల పట్ల దురుసు ప్రవర్తన, సమయపాలన పాటించకుండా ఆలయ ప్రతిష్ట భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్ల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో హుండీ ఆదాయం రూ.2 లక్షలకు పైగా వచ్చేదని ఇప్పుడు భారీగా తగ్గిందంటే అర్చకుల అంతర్గత వ్యవహారాలే కారణమన్నారు. ఇప్పటికైనా అర్చకుల ప్రవర్తనలో మార్పురాకపోతే విధుల నుంచి సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: నగర శివారు 44వ నంబర్ జాతీయ రహదారి తుంగభద్ర బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. జంగిల్ పాచి కలర్ ఫుల్ షర్టు, పంచ ధరించాడు. 5.5 అడుగుల ఎత్తు ఉంటాడు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 91211 01063 లేదా 91211 01064 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ప్రధాని సభకు రావాల్సిందే!

మూడు లక్షల మంది తరలింపునకు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులకు ఆదేశాలు

- మహిళా సంక్షేమానికి 16 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం
- ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎగ్గొట్టడంపై మహిళల్లో ఆగ్రహం
- డ్వామాకు 50 వేల మంది ఉపాధి కూలీలను తరలించే బాధ్యత


కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళల అభ్యున్నతికి అమలు చేస్తున్న కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటీ లేదు. కానీ ఈ నెల 16న దేశ ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగసభకు మాత్రం మహిళలే అవసరమయ్యారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి మూడు లక్షల మంది మహిళలను బహిరంగ సభకు తరలించే బాధ్యతను డీఆర్‌డీఏ, మెప్మా అధికారులకు అప్పగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడుస్తున్నా మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఆడబిడ్డనిధి కింద నెలకు రూ.1500 చెల్లిస్తామని 2024 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఊరూవాడా చాటిచెప్పారు. ఆ దిశగా ఎలాంటి చర్యలు లేకపోవడం పట్ల మహిళల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆడబిడ్డ నిధికి మంగళం పలికి పీ4 అనే కొత్త పల్లవి అందుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం పట్ల కూడా మహిళల్లో అసహనం కనిపిస్తోంది. తగినన్ని బస్సులు లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీనిపై ఇంతవరకు కార్యాచరణ లేకపోవడం గమనార్హం. ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్లు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఒక్క సిలెండర్‌తోనే సరిపుచ్చుతున్నారు. మహిళా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం ప్రధాని సభకు తమను ఏ మొహం పెట్టుకొని తరలిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రధాని సభకు వచ్చి తీరాల్సిందేనని, లేకపోతే సంక్షేమ పథకాలను తొలగిస్తామని డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తుండటం గమనార్హం. కాగా ఉపాధి కూలీలు 50వేల మందిని తరలించే విధంగా జిల్లా నీటియాజమాన్య సంస్థను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

పాఠశాలకు వెళ్తుండగా ఘోరం

- స్కూటర్‌ను ఢీకొన్న లారీ
- తండ్రి, కుమారుడు మృతి
- బిల్లేకల్లు సమీపంలో దుర్ఘటన



ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి శ్రీనివాసులు



విద్యార్థి శ్రీనివాసులు, తండ్రి మహేష్ (ఫైల్)

ఆస్పరి: దసరా సెలవులు ముగియడంతో కుమారుడిని పాఠశాలకు స్కూటర్‌పై తీసుకెళ్తుండగా గురువారం ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామ సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో తండ్రి, కుమారుడు మృతి చెందారు. కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన మహేష్, రామేశ్వరమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె లావణ్య 10వ తరగతి పాసై ఇంటి దగ్గరే కుట్టు మిషన్ నేర్చుకుంటున్నారు. చిన్న కుమార్తె గౌతమి.. పోతుగల్లు గ్రామంలో 7వ తరగతి చదువుతున్నారు. కుమారుడు శ్రీనివాసులు 9వ తరగతి ఆలూరు మండలం అరికెర గురుకులంలో చదువుతున్నాడు. దసరా సెలవులు ముగియడంతో కుమారుడు శ్రీనివాసులును (14) పాఠశాలలో విడిచేందుకు తండ్రి మహేష్ (45) గురువారం ఉదయం స్కూటర్‌పై బయలుదేరాడు. అయితే దేవనకొండ దాటిన తరువాత బిల్లేకల్లు సమీపంలో ఆస్పరి నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టడంతో విద్యార్థి శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తండ్రి మహేష్‌ను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందినట్లు ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ ముగ్గురిని చదివిస్తున్నారు. ఒకేసారి తండ్రి, కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోతుగల్లు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గిజిగాడి ప్రేమ సౌధాలు!



నీటి కుంట వద్ద తుమ్మ, రేగు చెట్లకు అల్లుకున్న గిజిగాడు గూళ్లు

దొర్నిపాడు: అత్యద్భుతమైన ఇంజినీరింగ్ నైపుణ్యంతో గిజిగాడు పక్షి నిర్మించిన వేలాడే గూళ్లు చూపరులను అబ్బుర పరుస్తున్నాయి. మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, చాకరాజువేముల, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల శివారుల్లో నీటి కుంటల మధ్య తుమ్మ, రేగుచెట్ల కొమ్మలకు ఏర్పాటు చేసుకున్న గూళ్లు ఆ వైపు వెళ్లిన వారికి కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం గిజిగాడి సంతానోత్పత్తి కాలం కావడంతో ఎక్కడ చూసినా గూళ్లు ఆకట్టుకుంటున్నాయి.


ఎంతో నేర్పరితనం..

గిజిగాడు కట్టే గూడు ఎంతో నేర్పరితనం కల్గి ఉంటుంది. గూళ్లు అల్లడం, పిల్లలకు ఆహారం నోటికి అందించడం, శత్రువులను ఎదుర్కొనడం.. పాములు, ఇతర శత్రువుల నుంచి గుడ్లనూ, పిల్లల్నీ కాపాడుకోవడానికి ముళ్ల చెట్ల పైన, నీటికి దగ్గరగా కిందకు వేలాడే రీతిలో కట్టుకోవడం వీటి అద్భుతమైన తెలివికి నిదర్శనం అని చెప్పవచ్చు.



ఆడ పక్షిని ఆకర్షించేందుకు గూడులో అల్లిన ఊయల

చెట్టు కొమ్మపై పక్షులు



ప్రేమ కోసం..

ఈ పక్షిజాతిలో మగపక్షి చక్కటి ఇంజినీరింగ్ ప్రతిభతో అందంగా గూడును అల్లి ఆడ గిజిగాడిని ఆకర్షిస్తుంది. ఆడపక్షికి ఆ గూడు నచ్చితే అందులో ఆవాసం ఏర్పరచుకొని మగపక్షితో జతకట్టి జీవనం గడుపుతుంది. ముందుగా మగ గిజిగాడు సగం గూడు అల్లాక రెక్కలు ఆడిస్తూ ఆడపక్షుల వద్దకు వచ్చి తాను తయారు చేస్తున్న గూడు చూడమన్నట్లు సంకేతం ఇస్తుంది. గుంపులో ఉన్న ఏ ఒక్క ఆడపక్షి మెచ్చకపోయినా దాన్ని వదిలేసి మరో గూడు అల్లడం మొదలు పెడుతుందట. అలా మెప్పించలేని మగ పక్షులు ఏడాది పాటు ఒంటరిగానే ఉండాల్సిందేనట. మంచిగా గూడు కట్టే ప్రతిభ ఉన్న మగ పక్షులే ఆడ పక్షుల ప్రేమను పొందుతాయట. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఎంతో ఆసక్తి అనిపిస్తుంది కదా. పాపం గిజిగాడు ప్రేమకోసం ఎన్ని కష్టాలో.

క్లుప్తంగా

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

నంద్యాల(అర్బన్): మండలానికి ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులతో పాటు స్థానిక సహజ వనరుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో జిల్లాలోని ఎంపీడీఓలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. అతిథిగా డ్వామా పీడీ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. మండలంలోని గ్రామ పంచాయతీలకు ఆదాయం లభించే వనరులు ఉంటాయని, వాటిని గుర్తించి వినియోగించుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూనే ఆదాయ వనరులు వృథా కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ పీడీ భాస్కరనాయుడు, డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

శ్రీశైలం ధర్మకర్తకు సన్మానం



శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థానం పాలక మండలి ధర్మకర్త, సీనియర్ బీజేపీ నాయకుడు మేడా మురళీధర్‌ను సత్కరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ మురళీధర్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కండె శ్యాం సుందర్‌లాల్, నాగరాజు, జనార్ధన్, నాగరాజు, మురళి, శివశంకర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల సమ్మెకు సీఐటీయూ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): వారం రోజులుగా చేస్తున్న డాక్టర్ల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ల సమ్మెతో గ్రామీణ ప్రాంత ప్రజలు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం డాక్టర్లతో చర్చించి సమ్మె విరమించేలా చూడాలన్నారు. లేని పక్షంలో డాక్టర్లకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

పాత్రికేయులపై కేసులు ఎత్తివేయాలి

నంద్యాల(అర్బన్): పాత్రికేయులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని పాత్రికేయ సంఘం జేఏసీ నాయకులు జయప్రకాష్ డిమాండ్ చేశారు. మహిళకు జరిగిన అన్యాయాన్ని ప్రచురిస్తే తప్పుడు కేసులు బనాయించి మీడియాకు సంకెళ్లు వేయాలని చూడటం సరికాదన్నారు. గురువారం జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఎస్పీ కార్యాలయ ఆవరణలోని ఏఎస్పీ యుగంధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఓ మహిళ తనను సీఐ వేధిస్తున్నాడని మీడియా ముందుకు వచ్చి చెప్పడంతో పాత్రికేయులు వార్త రాశారని, దీనిపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు


శిరివెళ్ల: మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని ఈఈ శ్రీధరరెడ్డి గురువారం తెలిపారు. శిరివెళ్ల మెట్ట నుంచి గోస్పాడు రోడ్డుకు రూ. 5.80 కోట్లు, శిరివెళ్ల నుంచి చిన్న కంబలూరు మెట్ట వరకు గల రోడ్డుకు 1.75 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు.

విద్యార్థులూ.. ఒత్తిడికి లోనవ్వొద్దు

బండి ఆత్మకూరు : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కేజీబీవీలో కెరియర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు సునీత, ఈశ్వర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థి మేలుకో – నీ మానసిక ఆరోగ్యం కాపాడుకో.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు మానసిక ఒత్తిడికి లోనవరాదని సూచించారు. మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత, ఒత్తిడి నివారణ, యోగా, ప్రశాంతత సాధనపై అవగాహన కల్పించారు.



అధికారులు వదిలేశారు.. ఇలా చెట్లుగా మారింది



ఫ్లైఓవర్ కింది భాగంలో ఇలా..



వంతెన ఎక్కిన మొక్కలు

ఇది నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ఫ్లై ఓవర్. 1996లో నంద్యాల ఎంపీగా పనిచేసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రత్యేక చొరవ తీసుకొని నంద్యాల ప్రభుత్వాసుపత్రి సమీపం నుంచి నేషనల్ సీడ్ కార్పొరేషన్ కార్యాలయం వరకు రైల్వే ట్రాక్‌పై దీనిని నిర్మించారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ వంతెన నిర్వహణ విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వంతెన ఇరువైపులా ఉన్న స్లాబ్‌ల్లో మర్రి, రావి మొక్కలు మొలిచి చెట్లుగా మారుతుండటంతో గోడలు పగుళ్లిస్తున్నాయి. వర్షం పడినప్పుడే వాటిలో నుంచి కిందకు నీళ్లు కారుతున్నాయి. ఇదే వంతెనపై తిరిగే అధికారులు సమస్య పట్టనట్టు వ్యహరిస్తున్నారు. మొక్కలే కదా అని వదిలేస్తే ముందు అవి ప్రమాదకరంగా మారడంతో పాటు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితి రాకముందే అధికారులు స్పందించి వంతెన ఇరువైపులా పెరిగిన మొక్కలను తొలగించాలని నంద్యాల ప్రజలు కోరుతున్నారు.

–నంద్యాల(అర్బన్)

బానకచెర్ల నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల రెగ్యులేటరు నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి కేవలం 5వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి 5వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ ద్వారా ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా తెలుగుగంగ (వీబీఆర్)కు 4,500 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 300 క్యూసెక్కులు, ఎస్కేప్ ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. దిగువనున్న గోరుకల్లు, గుండ్రేవుల, మైలవరం, సోమశీల ప్రాజెక్టులు అన్ని నిండినందున 10 రోజుల నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు వివరించారు.

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆధ్వర్యంలో ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లతో సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్‌లో డాక్యుమెంట్ అప్‌లోడ్, జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం యొక్క మూడు అంచెల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణ, మందుల పంపిణీ, ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, రోగ నిర్ధారణ సేవలు, కొత్త స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ, రైతు సేవా కేంద్రాల తనిఖీలు, రైస్ మిల్లుల ట్యాగింగ్, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏజీవై) పురోగతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రిలీఫ్ మొత్తాల చెల్లింపులు, ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసిన వాహనాల పారవేత, పెన్షన్ పునఃమూల్యాంకనం వంటి పలు అంశాలపై సమీక్ష చేపట్టారు. జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రజాభిప్రాయ సేకరణలో మెరుగైన శాతం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇటీవల తాను బేతంచర్ల మండలంలోని ఆర్.ఎస్. రంగాపురం గ్రామంలో ఉన్న మద్దిలేటి స్వామి ఆలయాన్ని సందర్శించారని, ఆలయంలో ప్రాకారం, గోపురం, మరుగుదొడ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇప్పటివరకు 25 వేల జాయింట్ ఎల్‌పీఎంలు పరిష్కరించబడ్డాయని, పెండింగ్‌లో ఉన్నవాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): వరిపంట సాగు చేసిన రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ మందు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొత్తపల్లె గ్రామంలో వరిపంటలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాలో 15–20 ఎలుకల బోరియలను ఏర్పాటు చేయాలన్నారు. వాటిలో ఎరలను పెట్టి మట్టితో మూసి వేసిన మరుసటి రోజు బ్రోమోడియాలోన్ 0.25 ఎరలను ఉంచాలన్నారు. ఒక కేజీ ఎరను తయారు చేసుకోవడానికి 960 గ్రాముల నూకలు, 20ఎంఎల్ నూనె, 20గ్రాముల బ్రోమోడియలోన్, 0.25 మందును కలుపుకొని 15 గ్రాములు ఒక ప్యాకెట్‌గా చేసుకొని బోరియలు ఉన్న చోట ఉంచాలన్నారు. ఎలుకలు వాటిని తిని రెండు మూడు రోజుల తర్వాత చనిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఏఈఓ మహేష్, సురేష్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు ఆసుపత్రులకు పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించి ఎన్‌టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్‌టీఆర్ వైద్య సేవలను నిర్వీర్యం చేయాలని చూడటం తగదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రులకు ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్టు రూ.2700 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ బకాయిలను చెల్లించి పేద ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని, లేని పక్షంలో సీపీఐ ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, నాగరాముడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం క్షేత్రస్థాయిలోనే జరగాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): గ్రామాల్లోని అర్జీదారులు, రైతుల నుంచి వచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించాలని నంద్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్లు శ్రీనివాసులు, శ్రీవాణి వీఆర్వోలకు సూచించారు. స్థానిక నిశాంత్ భవన్‌లో గురువారం ఫిర్యాదుల తక్షణ పరిష్కారంపై వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులను అక్కడే పరిష్కరిస్తే అర్జీదారులు పట్టణానికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించలేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీలు రామసంజీవరావు, రామచంద్రారావు, ఆర్ఐలు ప్రసాద్, మాధవిరెడ్డి, ఎన్నికల డీటీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



బొల్లవరం సమీపంలో ఇలా..

మంటలు కావవి.. మేఘాలే



అరుణ వర్ణంలో ఆకాశం..



ఇళ్లల్లో నుంచి మంటల వస్తున్నట్లుగా..

మహానంది: ఇదేంటి ఇళ్లల్లోంచి మంటలు వస్తున్నాయన్నట్లుగా ఉన్న ఈ దృశ్యాలు గురువారం సాయంత్రం ఆవిష్కృతమైంది. నింగి అరుణ వర్ణంలో విరాజిల్లడంతో చూపరులను ఆకట్టుకుంది. ఎరుపెక్కిన మేఘాలు దారిని పరిచాయి. పచ్చటి పంట పొలాలపై మండుతున్న మంటల్లాగా ఆకాశం అబ్బురపరిచింది. మండలంలోని బొల్లవరం, బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల వద్ద ఆకాశం వర్ణరంజితమైన దృశ్యాలను సాక్షి కెమెరాలో బంధించింది.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 21 మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు 21 మందిని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ రామకృష్ణారెడ్డి, కన్సోట్రాక్స్ సర్వీస్ ఎల్ఎల్‌సీ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు సాయిబాబా తెలిపారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణార్థం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామి వారికి విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీ సేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించారు. తరువాత స్వామివారికి పంచామతాభిషేకం, పూజలు నిర్వహించారు.

అనుమానితులకు రూములివ్వొద్దు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో అనుమానిత వ్యక్తులకు రూములు ఇవ్వరాదని శ్రీశైలం సీఐ జి. ప్రసాదరావు సూచించారు. గురువారం శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో సత్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి వీవీఐపీ సందర్శన దృష్ట్యా భద్రతా చర్యల్లో భాగంగా సత్రాల మేనేజర్లకు పలు సూచనలు చేశారు. రూము కచ్చితంగా 24 గంటల్లో రెన్యువల్ చేయించాలని, ఒక రోజు కన్నా ఎక్కువ ఎవరికీ గది ఇవ్వరాదడు ఆదేశించారు. రూమ్ బాయ్స్, పనిచేసే వారిని కొత్తగా ఎవరినీ పనిలో నియమించకూడదని, సత్రాలలో పనిచేసే వారి నడవడిక, ప్రవర్తనను గమనిస్తుండాలని చెప్పారు. అన్ని సత్రాలలో సీసీ కెమెరాలు తప్పనిసరన్నారు.

బీళ్లుగా మారుతున్న పొలాలు



ఉయ్యాలవాడ గ్రామ సమీపంలోని పొలాల్లో కలుపు మొక్కలను తొలగిస్తున్న కూలీల

ఉయ్యాలవాడ : ఓ వైపు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూ ఉన్నాయి. మరోవైపు రబీ సీజన్ ప్రారంభమైంది. ఇంత వరకు పొలంలో విత్తనం పడకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కురుస్తున్న వర్షాలకు పొలాలు తడి ఆరకపోవడంతో కలుపు మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వాటిని తొలగించడం రైతులకు కష్టంగా మారింది. సేద్యం చేసేందుకు కూడా వీలు లేకపోవడంతో బీడు భూములుగా పొలాలు మారాయి. మండలంలో జిల్లాలోనే అత్యధికంగా రబీలో 14,000 హెక్టార్లలో పప్పు శనగ పంట సాగు అవుతుంది. ఇంత వరకు సాగుకు రసాయనిక ఎరువులు ఎత్తడం, భూమిని చదును చేసుకోవడం వంటి పనుల్లో రైతులు ముందుకు సాగలేకపోతున్నారు. భారీ వర్షాలతో పొలాలన్నీ బీళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో కూలీల డిమాండ్ పెరిగింది. కలుపు మొక్కలను తొలగించేందుకు ఎకరానికి రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. అయినా, కూలీలు దొరకడం కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును గుర్తించాలి



రైతులకు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేసిన దృశ్యం

నంద్యాల(అర్బన్): మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, తద్వార పంట దిగుబడులను సాధించుకోవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ తెలిపారు. మారుటేరు వ్యవసాయ శాఖ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సౌజన్యంతో పంట వైవిధ్య పథకంపై స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రవరం మండలం మందలూరు గ్రామానికి చెందిన 40 మంది రైతులకు మొక్కజొన్న విత్తనాలు అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ వరి పంటకు బదులుగా మొక్కజొన్న సాగు చేయాలని, విత్తనాలను పుష్ హోసీడ్రిల్ ద్వారా విత్తుకోవాలన్నారు. డీఏఓ మద్దిలేటి మాట్లాడుతూ సూక్ష్మ నీటి పారుదల పద్ధతి అయిన డ్రిప్ పద్ధతిని ఉపయోగించుకోవాలన్నారు. డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పశువుల ఎరువుతో పాటు భూసార పరీక్షను అనుసరించి నత్రజని ఎరువులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్, సుమతి, శాస్త్రవేత్త, రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటాలి



క్రీడాకారులతో డీఎస్పీ జావళి ఆల్ఫోన్స్

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటాలని డీఎస్పీ జావళి ఆల్ఫోన్స్ అన్నారు. గురువారం రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులను నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారుల వెంట నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విశ్వనాథ్, నాగరాజు, టీం మేనేజర్ సురేష్, కోచ్ విజయామణి, సెక్రటరీ ఫయాజ్ తదితరులు ఉన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక పోటీలు

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరుగుతున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో–ఆర్డినేటర్ షేక్షావలి గురువారం తెలిపారు. అండర్ 17,14 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో బాలికలు, బాలురు పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18న డివిజన్ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

బాక్సింగ్ పోటీలకు చాబోలు విద్యార్థుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా పరిషత్ చాబోలు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శివలింగం, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేష్ తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. గత నెల 9వ తేదీన పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన కర్నూలు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయి తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 6వ తరగతి చదువుతున్న దూదేకుల హరీఫ్ 30 కేజీల విభాగం, 7వ తరగతి చదువుతున్న కడియం సురేంద్ర 40 కేజీల విభాగంలో ప్రతిభ చాటినట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి మారథాన్ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): విజయవాడలో శుక్రవారం జరిగే రాష్ట్రస్థాయి మారథాన్ పోటీలకు నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రసన్న ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆ విద్యార్థినిని అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 9వ తేదీన జరిగిన మారథాన్ పోటీల్లో జిల్లా స్థాయి రెడ్‌రన్‌లో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థినిని వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, వ్యాయామ అధ్యాపకుడు శ్రీనివాసులు అభినందించారు.


క్రీడాకారులకు ప్రోత్సాహం



దుస్తులు ధరించిన క్రీడాకారులతో సర్పంచ్ రాజు

నంద్యాల(అర్బన్): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ సర్పంచ్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు రూ.10 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను గురువారం ఆయన హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిరంతర సాధనతో క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3 శాతం కోటా ఇవ్వడం జరుగుతుందని, పాఠశాల విద్యాసమయంలోని క్రీడాకారులు క్రీడల పట్ల ఉత్సాహం ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే



బాలికల కబడ్డీని తిలకిస్తున్న ఎంఈఓలు

దొర్నిపాడు: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని మండల విద్యాధికారి మనోహర్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా మండలస్థాయి ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు, ఉద్యోగాలకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. కావునా ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాలకు సంబంధించి డివిజన్ స్థాయి జట్లను ఎంపిక చేశారు. కార్యక్రంలో ఎంఈఓ–2 రామచంద్రయ్య, హెచ్ఎం చెన్నకేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీలు దేవేంద్ర, సువర్ణ, సరళ, బాలకృష్ణ, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు రమణయ్య, మల్లికార్జున, నాగరాజు, మధుసూధకర్‌రావు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడాకారులతో దాత పి.శ్రీనివాసులు, హెచ్ఎం.సుబ్బారాయుడు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు విశ్రాంత జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పి. శ్రీనివాసులు రూ.10 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను గురువారం అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు జేవీ సుబ్బారాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తేవాలని ఆయన విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు ముల్లా దాదాపీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.